# ఆదర్శమూర్తి

రచన :
కె. పి. బాబు

మొదటి ఆట వదిలి అరగంట కావస్తుంది. ఆ థియేటర్ ముందునుండి అలా పైకి పోతున్నాడొక యువకుడు. గ్లాస్కో పంచె, సిల్కు లాల్చీ ధరించాడు. నొక్కుల జుట్టును ఎగదువ్వాడు. కాళ్ళకీ, కళ్ళకీ జోళ్లున్నాయి. తలవంచుకుని, మెల్లగా ముక్కుకు సూటీగా సాగిపోతున్నాడు. తనలో తానుగా ఓపాట పాడుకుంటున్నాడు. ఆ పాటకు తాళం వేస్తున్నట్లుగా అతని కాలి స్లిప్పర్లు - 'టప్-టప్' మంటున్నాయి,

ఆ హాలుకు కొంచెం దూరంలో వున్న ఓ చిన్న సందు మొగదల, ఎలెక్ట్రిక్ దీపస్థంభం క్రీనీడలో నిలబడి దిక్కులు చూస్తున్నాడో కుర్రాడు. ఆ కుర్రాడిని దాటుకుని ముందుకి నడిచాడు యువకుడు. అతడు కొంచెం దూరం వెళ్ళేవరకూ పరీక్షగా చూసి ఆ కుర్రాడు, రెండంగల్లో వెళ్లి అతన్ని సమీపించాడు, రెండడుగులు అతనితో కలిసి నడిచాడు,

'సార్!...సార్!...అన్నాడు మెల్లగా కుర్రాడు.

అతను వినిపించుకోలేదు. తనధ్యానలో తాను పడి పోసాగాడు.

'సార్!' అన్నాడు మళ్లీ కుర్రాడు.

ఉలిక్కిపడి, ప్రక్కకు తిరిగి చూచాడు యువకుడు,

'అగ్గిపెట్టె వుందా సార్?' అనడిగాడు కుర్రాడు.

'చుట్టా, బీడీ, సిగరెట్ వగైరాలు తాగే అలవాటు లేదు నాకు'.

'అన్నాడతను చిరునవ్వుతో నడుస్తూనే'

రెండడుగులు అతన్ని అనుసరించాడా కుర్రాడు బుర్ర గోక్కుంటూ. ఉన్నట్లుండి, 'సార్! వస్తారా సార్?' అన్నాడు.

'నేనేనా? ఎక్కడికి?'

'ఇక్కడే సార్! ఆ పక్క సందులో...'

'ఏపక్క సందులో? ఏమిటి కథ?' అన్నాడతను నడుస్తూనే.

అతని ధోరణి ఆ కుర్రాడికి నవ్వు తెప్పించింది 'సార్! ఈ హాల్లో ఆడ్తున్న సినిమా చూశారా సార్?' అన్నాడు.

'చూల్లేదు. ఏం?'

'ఆ సినిమాకన్నా చాలా బాగుంటుంది సార్ మా అక్క టక్కున ఆగిపోయాడా యువకుడు. దానితో కుర్రాడు మరింత ఉషారుగా,' యెంతో యివ్వక్కర్లేదు సార్! ఒక్కసారి వచ్చి చూస్తే, మళ్ళీమళ్ళీ మీ అంతట మీరే వస్తారు సార్! అన్నాడు.

'ఏం తెలివి తేటలు! అనుకుని నవ్వబోయాడతను, అయితే - ఆ వయసులో తాను ఫోర్తు ఫారం చదువుతున్నాడు. కాని, యీ కుర్రాడు...అది తలపు కొచ్చి - నవ్వు పోయింది.

'ఇలా రా' అని, దగ్గర్లోనే వున్న ఓ ఎలెక్ట్రిక్ దీపస్థంభం క్రీనీడలోకి దారి తీశాడా యువకుడు. కుర్రాడతన్ని అనుసరించాడు.

'నాకు తెలియక అడుగుతాను, రోజూకి ఎంత సంపాదిస్తుంటావ్ నీవు?' అనడిగాడతను.

ఆ కుర్రాడు అతని ప్రశ్నకు మొదట తెల్లబోయి, తరువాత నవ్వేశాడు.

అతను నవ్వలేదు, 'ఫర్వాలేదు-చెప్పు' అన్నాడు.

'ఏం చెప్పేది సార్! ఒకరోజు రూపాయి చిక్కితే ఒక్క రోజు అయిదేసి రూపాయలు దొరుకుతాయి, ఒక్కొక్కనాడు కాఫీ డబ్బులుకూడా రాకపోవచ్చు. అంతా అదృష్టం మీద ఆధారపడి వుంటుంది - అంతే సార్!'

ఆ మాటలు వింటూనే అతను లాల్చీ జేబులు తడుముకున్నాడు. ఇంత చిల్లర పైకి తీసి, లెక్కపెట్టి చూచాడు. ఇదిగో మొత్తం నా దగ్గరున్నదే రూపాయి బేడా అర్ధణా. ఈ ముప్పావుల తీసుకువెళ్లు - నా తిప్పలేవో నేను పడ్తాలే...' అంటు పన్నెండణాలు తీసి ఆ కుర్రాడికిచ్చాడు.

అలవాటు చొప్పున అందుకుని, తరువాత వింతగా అతన్ని చూస్తూ, 'ఇదేమిటి సార్! యింతకీ మీరురారా?! అన్నాడు కుర్రాడు.

అతను నీరసంగా నవ్వాడు. ఈ బట్టలూ అవీ చూచి భ్రమపడి వుంటావు - పాపం! కాని, నేను మీ అక్కని

తృప్తిపర్చగలవాడనేమీ కాను, నీ పైన నా మూలంగా ఆశాభంగం పొందినవాడని కాకూడదని యీ చిల్లర డబ్బులిస్తున్నాను - తీసుకు పో,' అని మళ్ళీ తనదారిని తాను ముందుకు, ముక్కుకు సూటిగా - మెల్లగా సాగిపోయాడా యువకుడు.

ఆ కుర్రాడు అక్కడే నిలబడి, ఒకసారి తనచేతిలోని డబ్బుల్నీ, ఒకసారి అలా పోతున్న అతన్నీ చూస్తూ వుండిపోయాడు చాలసేపు.

* * *

'అక్కా! అక్కా!'

'ఏమిట్రా, ఇంట్లోకి అడుగు పెట్టూనే అలా గావు కేకలు పెట్టావ్?'

'కాదక్కా! అతను-మొన్న నీకు చెప్పలా; అతనే యిప్పుడు మన సందులోంచే వెళ్తున్నాడే. చూడాలనుంటే చప్పున రావాలి.'

ఆ కుర్రాడు కొంచెం పోకిరీ రకం. ప్రపంచంలో ఎవరిపట్లా వాడికి భయభక్తులు లేవు. అటువంటివాడి గౌరవాభిమానాలింతగా పొందిన వ్యక్తి ఎంతటివాడై వుండాలో - చూద్దామని ఆమె, చటున వీధిగుమ్మంలోకి వచ్చి నిలబడింది.

'ఇటు కాదక్కా! అటు-అలా చూడు. అడుగో, పంచెకట్టుకుని - లాల్చీ వేసుకున్నాడే-ఆ నొక్కులజుట్టతనే! చూడు ఎలా తలొంచుకుని ముక్కుకు సూటిగా వెళ్ళిపోతున్నాడో!' అని కుర్రాడు వివరిస్తుంటే, ఆమె అలాగే చూస్తూ నిలబడిపోయింది.

అతనెవరో? ఏంచేస్తుంటాడో? వివరాలు తెలిస్తే బాగుణ్ణనే కుతూహలం అనాలోచితంగా కలిగిందామెలో. మొదటి ఆట ఇంటర్వెల్ అయింది అప్పుడే. అతనా సందుచివరకు వెళ్ళిపోయాడు.

'అతనుండేది ఎక్కడో?' అన్నది అతన్ని చూస్తూనే తనలో తానుగా.

'నాకేం తెలుసు?' అని, ఆ వెంటనే ఏదో తట్టినట్లు చిటికవేసి-'అతన్ని అడిగివచ్చేదా అక్కా?' అన్నాడు కుర్రాడు.

ఆమె ఒకనిమిషం ఆలోచించి, 'అతన్నే యిక్కడికి తీసుకు రారాదురా ఒకసారి' అన్నది.

కుర్రాడికది మరింత సంతోషం కలిగించినట్లుగా, 'ఓ. యెస్‌గా-అదెంతపనక్కా!' అంటూనే సందులోకి ఉరికాడు. ఒక్క పరుగులో ఆ యువకుణ్ని కలుసుకున్నాడు. ఎంతో పరిచయం వున్నవాడిలా చేయి పట్టుకుని, 'సార్!' అన్నాడు.

తృళ్ళిపడి ప్రక్కకు తిరిగి నవ్వుతున్న కుర్రాడిని చూచి గుర్తుపట్టాడతను. తనూ మందహాసంచేసి, 'ఏం, ఉషారుగా వున్నావు? నీపనిప్పుడు బాగుందా యేమిటి?' అన్నాడు.

కుర్రాడు నవ్వుతూనే, 'అది కాదు సార్, మీరు వెంటనే ఒకసారి మా యింటికి రావాలిప్పుడు. రండి సార్!' అన్నాడు చెయ్యి వదలకుండా.

'నేనా? మీయింటికా? ఎందుకూ?'

'ఏమో సార్! మా అక్క ఒకసారి పిల్చుకు రమ్మంది. రండి సార్! అదిగో-గుమ్మంలో నిలబడి చూస్తూంది చూడండీ.'

అతను ఆశ్చర్యంగా ఆ కుర్రాడు చూపినవైపు పరిశీలనగా చూచాడు. అక్కడో పెంకుటిల్లు - చిన్నది కన్పించింది. ఆ యింటిగుమ్మంలో ఎవరున్నదీ మాత్రం కన్పించలేదు. ఒకసారి ఆ యింటివైపూ, ఒకసారి ఆ కుర్రాడివైపూ చూచి, 'సరే-పద' అన్నాడతను.

పడకగది గుమ్మానికి ఆనుకుని నిలబడి, 'కుర్రాడినలా ఎందుకు పంపానా?' అని తర్కించుకుంటున్న ఆమె-''అక్కా, అక్కా! అతనొచ్చాడే' అన్న కేకలకి తేరుకొంది.

'సరేలేగాని, నీవు అరవడం మాని - వీధిగుమ్మంలోనే వుండు వెళ్ళి. మరెక్కడికీ పోకు సుమా!' అని కుర్రాడితో చెప్తున్నంతలోనే-

స్వంత యిల్లులా ఆ యువకుడు తలవంచుకునే సరాసరి లోనకొచ్చేశాడు - మెల్లగా.

'సార్! యీమేనండీ మా అక్క'' అన్నాడా కుర్రాడు నవ్వుతూ. అతను ఆగి, తలెత్తి చూచాడు. ఎదురుగా ఆమె కనిపించింది. వయసు పాతికేళ్ళకు మించదు గాని, ముప్పై ఏళ్ళు పైబడిన మనిషిలా గోచరిస్తోంది, అందంకన్నా ఆకర్షణే జాస్తీగా వుందామెలో,

తనని చూచి బిత్తరపోతున్న ఆమెతో, 'అది సరే, ఇంతకీ పిలవమన్నది నన్నేనా?' అన్నాడు - యెక్కడన్నా పొరబాటు జరిగిందేమోనన్నట్లు.

ఆ మాటలు విని, అతని ధోరణిగురించి కుర్రాడు చెప్పినదానిలో అతిశయోక్తి ఏమీ లేదనుకుని నవ్విందామె.

అతను నవ్వకుండానే, 'అయితే - యింతకీ నన్ను ఎందుకు రమ్మన్నట్లు?' అన్నాడు.

'అవును. ఎందుకు రమ్మన్నట్లు?' అనుకుంటూ, ఏమి చెప్పాలో తోచక మళ్లీ నవ్వి వూరుకుందామె.

ఆ నవ్వుతో, లాల్చీ జేబుల్లోకి చేతులు దూరుస్తూ, 'అంతేనని అనుకుంటూనే వచ్చాను. కాని—' అని ఆగాడు.

ఎందుకో అతన్ని కొంచెం ఆడించాలనిపించిందా క్షణంలో ఆమెకు. 'ఏమిటి, డబ్బులున్నాయో లేవో చూచుకుంటారా? డబ్బులు లేకపోయినా ఫర్వాలేదు కాని, యీ రాత్రికిక్కడే వుండండి' అన్నది.

అతను నవ్వి, 'నీవు పొరబడుతున్నావు. డబ్బులున్నా నేనిక్కడ వుండను,' అన్నాడు.

'అదేం?' అన్నదామె తెల్లబోయి.

'నా పద్ధతులు నావి. నీవేమన్నా చదువుకున్నావా?' అనడిగాడు.

'ఆఁ! అయిదో క్లాసువరకూ అదీ వెలిగించాను.'

'చాల్లేగాని, ఏమన్నా పత్రికలూ - పుస్తకాలూ చదివే అలవాటుందా?'

'ఓ.'




జీకో....

మోటారులు

From: 1 H. P. 2 H. P. 3. H. P. 5. H. P. 7, 5 H. P. 10 H. P. 12. 5 H. P. 15 H. P.

అన్నియూ 1440 రెవిల్యూషన్స్ కలది. నిమిషానికి 2880, 960, 720, చుట్టును. ఈ విధముగా మేము తయారుచేస్తాము.

పంపు సెట్టులు :- 2" నుంచి 4" వరకు.

మోటారులు:- 1 H. P. నుంచి 15 H. P. వరకు.

అన్నియూ రెండు సంవత్సరములు గ్యారంటీ,

తయారుచేయువారు:—

THE GENERAL ENGINEERING CO.,
PATEL ROAD, COIMBATORE

P. B. No, 257 (S. INDIA) Phone No. 1011

'ఆ మాత్రం చాలు నేను చెప్పేది అర్థం చేసుకోవడానికి. విను - నేనో దౌర్భాగ్య దామోదరుణ్ణి. నాకీ లోకంలో స్నేహితులు తప్ప, తల్లీ తండ్రీ బంధువులూ యెవరూ లేరు. మాది యీ వూరు కాదు. ఇక్కడేదో మంచి ఉద్యోగం వుంది - ట్రై చేద్దాం రమ్మని ఒక స్నేహితుడు రాస్తే వచ్చాను. ఏదో చెప్పబోయి, నీ కింకేదో చెప్తున్నట్లున్నాను. ఆ! అదే ఏదన్నా మంచి ఉద్యోగం సంపాదించుకుని, ఎవరన్నా ఒక అనాథను చేరదీసి, ఆమెతోనే ఆ జన్మాంతం కాలం గడపాలని నా కోరిక. అంతేగాని, ఇటువంటి చిల్లర మల్లర అలవాట్లు నాకు లేవు-అయిష్టం కూడాను' అన్నాడతను గంభీరంగా.

ఆమెకేదో సినిమా చూస్తున్నట్లుంది. ఇంతకీ మీకు ఉద్యోగం చిక్కిందా?' అన్నది అప్రయత్నంగా.

'అంతా అనుకున్నట్లే అయిందిగాని, చివరి ఘట్టంలో మాత్రం ఒక పెద్ద మనిషికి యాభై రూపాయలు లంచం యిస్తేగాని పని పూర్తి కాదని తెలిసింది.'

'మరీ - మరి - యివ్వకబోయారా?'

అతను విషాదంగా నవ్వాడు. అతని వేషభాషాలన్నీ మొదటినుంచి ఆమెని ఏదో అనుమానాన్ని రేకెత్తిస్తూ వచ్చాయి. ఆ నవ్వుతో ఆమెకంతా అర్థమై పోయినట్లు భావించుకుంది. చిన్న ఎత్తువేసి చూద్దామని 'పోనీ, మీరింకోలా అనుకోనంటే - ఆ యాభై నేనిస్తాను; తీసుకువెళ్లి - ఉద్యోగం సంపాదించుకుంటారా?' అన్నది.

మళ్ళీ పొరబడ్డావు. ఏభై రూపాయలు పుట్టించేపాటి పరపతిలేని వాణ్ణేమీ కాను. కానీ, లంచం పుచ్చుకోవడం కన్నా అది యివ్వడమే పెద్ద నేరం అని నా నమ్మకం. అందుకని—'

ఆ మాటలతో ఆమె చకితురాలైంది, తన అనుమానాలు మాత్రమేనని తెలుసుకుని లోలోని చాలా సిగ్గు పడింది. అతనిపై యెక్కడలేని గౌరవం, విశ్వాసం కలుగజొచ్చాయి ఆ క్షణంనుండే.

'-అందుకని? లంచం యివ్వకూడదనే ఒక పట్టింపు మూలంగా మీకు దొరకనున్న ఉద్యోగాన్ని, తన్మూలంగా ఒక అనాథకు కలుగనున్న భాగ్యాన్ని పోగొట్టా



జగపతివారి
'అన్నపూర్ణ'లో
రేలంగి - గిరిజ




Tel : "MUTHU" :: Phone No. 25

USE ALWAYS

**MUTHU FABRICS**

MANUFACTURERS OF HANDLOOMS,—

- BEDSHEETS.
- TABLE CLOTHS.
- PILLOW COVERS.
- NAPKINS.
- FURNISHING FABRICS Etc.,

ఎల్లప్పుడూ
ముత్తు ఫేబ్రిక్స్‌నే
ఉపయోగించండి.

మా సొంత చేతి మగ్గాలచే:...

* బెడ్ షీట్లు,
* టేబిల్ క్లాత్‌లు.
* దిండు గిలేబీలు.
* నేప్‌కిన్స్.
* బల్లలపై పరచు గుడ్డలు వగైరాలు.

తయారుచేస్తున్నాము.

: వివరములకు :

S. MUTHUSWAMI GOUNDER & CO.,
Weaving Factory
P. B. No. 60. :: KARUR (S. I.)

ఎస్. ముత్తుస్వామి గౌండర్ అండ్ కో.
వీవింగ్ ఫాక్టరి
పి. బి. నెం. 60 :: కరూర్ (S.I.)


రన్న మాట?! ఇదేమాదర్శమో నాకర్థం కావడం లేదు సుమండీ' అన్నది ఆత్రంగా.

'నీకంత అనుభవం లేదు కాబట్టే, యిలా మాట్లాడుతున్నావనుకుంటున్నాను. ఒక లాభాన్నాశించి ఒక ఆశయాన్ని చంపుకోవడం ఆదర్శ పురుషుల లక్షణం కానేకాదు. ఆదర్శాలను ఆచరణలో పెట్టేటప్పుడు అనేక కష్టనష్టాలెదురు కావడం సహజమే. కానీ, 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అని చిన్నప్పుడు చదువుకున్న పాఠంమీద నాకిప్పటికీ నమ్మకముంది- తెలుసా?' అన్నాడు.

ఆమె ఏమనేందుకూ తోచక, అలానే నిలబడి అతన్ని తదేకంగా చూస్తుండిపోయింది. ఆమె స్థితి గుర్తించి చిరునవ్వుతో-'ఇక నేను వెళ్ళొస్తాను మరి. నీకేమన్నా ఆశాభంగం కలిగించినా, బాధాకరంగా ప్రవర్తించి వున్నా అన్యథా భావించవద్దు - సెలవు, అంటూ వెనుదిరిగి - యథాపూర్వకంగా తలొంచుకుని, ముక్కు సూటిగా- మెల్లగా బయటకు వెళ్ళిపోయాడతను.

* * *

ఆ తరువాత మళ్ళీ అతను కనిపించలేదు. ఇక కనిపించడనే ఆమె అనుకునేది. జీవితంలో అనేకమందిని

చూచివున్నదికాని, అతనివంటి వ్యక్తి మాత్రం యింకొకరు ఆమెకు ఎప్పుడూ కనిపించలేదు. అందుకేనేమో, తరుచుగా అతను గుర్తుకు వస్తుండేవాడు. అతను తలపుకొచ్చినప్పుడల్లా-'అభాగ్యుడు, అమాయకుడు కూడాను-పాపం!' అనుకుని, ఒక నిట్టూర్పు వదిలేది.

అలా మూడు నెలలు గడిచిపోయాయి.

ఒకనాటి మధ్యాహ్నం-వంటగదిలోనుండి యివతలికి రాబోతున్న ఆమెకు, ఎవరో ఒకయువకుడు అగదివైపే వస్తూవుండడం కనిపించింది.

గ్లాస్కో-పంచె. సిల్కు-లాల్చీ. ఎగదువ్విన నొక్కుల జుట్టు. కళ్ళకి జోడు. ఎవరది? ఎవరు?

'ఓ. ఇక్కడున్నావా? నీలాంటివాళ్ళు వంటగదిలో వుంటారని ఎలా అనుకోనేది? అందుకని, తిన్నగా వెళ్ళి పడగ్గదంతా వెదికానింతసేపూ. సరేగాని-ఎలాగున్నావు! ఏమిటి సంగతి? ఏడీ, నీతమ్ముడెక్కడ, కన్పించడేం?'

గబగబా మాట్లాడేస్తున్న అతన్ని గుర్తుపట్టి, దిగ్భ్రమ చెందిందామె.

'మీరా?'

'అవును-నేనే! ఏం అలా చూస్తున్నావు? గుర్తుపట్టలేనంత మారిపోయానా 'ఏమిటి, కొంపదీసి!' అని తనని తాను చూచుకోనారంభించాడతను.

అప్రయత్నంగా అతని ధోరణికి నవ్వొచ్చిందామెకి.

'లేదు గాని, నిలబడే మాట్లాడుతున్నారేం - కూర్చోండి,' అన్నది పడకగదిలోకి దారితీస్తూ,-

'లేదులేదు. కూర్చుని మాట్లాడ్డానికి సరిపోయే టైం లేదిప్పుడు నాకు. నీతో రెండు మూడు ముఖ్యమైన సంగతులు చెప్పిపోదామని వచ్చాను - యిలా చూడు' అన్నాడామెను అనుసరిస్తూనే.

ఆమె వెనుదిరిగి చూచింది.

'నాకిప్పుడు ఉద్యోగం దొరికింది. అంచేత యిస్తే



క్రిష్ణ చిత్రవారి
'బావమరదలు' చిత్రంలో
మాలిని





వచ్చేదానికన్నా మంచి ఉద్యోగమే దొరికింది - అది యివ్వకుండానే, మరీ తమాషా ఏమంటే-నన్ను లంచం అడిగిన పెద్దమనిషిని మరో అతనిబద్ద లంచం పుచ్చుకుంటుంటే పట్టుకని, ఉద్యోగంలోంచి పీకేశారు. ఆ ఖాళీలోనే నన్ను వేసుకన్నారు - ఎలాగుంది? ఇప్పుడు నా చేతికిందక మంచి తెలివి తేటలూ, చురుకుదనమూ గల ఓ కుర్రాడు కావాలి. నా కిష్టమైనవారిని ఎవరినన్నా తెచ్చిపెట్టుకోవచ్చున్నారు. ఆ పనికి మీ తమ్ముడిని లాక్కుపోతే, నాకూ సరిపోతాడు - వాడూ బాగుపడతాడు యికనుండైనా - 'అని', వెంట తీసుకపోదామని యిలాగొచ్చాను. మరోవిషయం-ఇంతకాలం ఒకరోజు ఒక స్నేహితుడి యింట్లోనూ, మరో రోజింకో స్నేహితుని రూంలోనూ - యిలా గడుపుకొచ్చాను. ఇకనైన అలావుండడం అనవసరం - బాగోదుకూడానని చిన్న యిల్లొకటి అద్దెక తీసుకన్నాను. సొంత కొంపనేది యింతకాలం ఎరుగను. అదీగాక-ఆఫీసు వ్యవహారాలైతే సరిచూడ్డం తెలుసు గాని; ఇంటివిషయాలేమీ నాకసలు తెలియవు. అవన్నీ చూచేందుక ఒకరు కావాలి గదా! ఎవరో ఎందుక - నిన్నే తీసుకపోతే, నాకేగాక, నీక్కూడా బాగుంటుందేమో కనుక్కుపోదామని వచ్చాను. ఏమంటావు?'

కొత్త కుండలో నీరుపోస్తే చెమ్మగిల్లినట్లు ఆమె శరీరమంతా చిరుచెమట్లు పట్టాయి-అతని మాటలువింటుంటే.

'ఆ కుర్రాడిని మీ చేతికింద వేసుకొంటానంటే నాక చాల ఆనందంగావుంది. వాడుకూడా మీ దగ్గరకంటే తప్పకుండా వస్తాడు. ఈ సందర్భంలో మీకో సంగతి చెప్పాలి. వాడూ ఆదిలో ఏదిక్కూలేనివాడే! నాతోడ బుట్టినవాడు కానేకాదు. నేనీవృత్తిలో ప్రవేశించిన కొత్తలో ఒకరోజు మాయింటికి బిచ్చం అడుక్కోడానికి వచ్చి, ఏదో దొంగిలించబోతూ నాకంటపడ్డాడు. వాడి కథ విని, స్థితిచూచి, జాలిపడి చేరదీశాను; ఆశ్రయమిచ్చాను; దొంగబుద్ధి పోగొట్టాను; నా తమ్ముడిలాగే చూచుకుంటూ వస్తున్నాను. కాని, వాడిలా జీవించడం కూడా నాకెంతమాత్రం యిష్టం లేదు. ఏదైనా మంచి బ్రతుక తెరువు వాడికి చూపలేకపోయానే అనే చింత యీనాటితోనన్నా తీర్తున్నందుక ఎంతైనా సంతోషంగా వుంది. వాడికో మంచిదారి చూపుతున్నందుక మీక వాడేగాక, నేనుకూడా యావజ్జీవితం ఋణపడి వుంటాను' అన్నదామె కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ.

'అది సరేగాని - నీ సంగతేం చెప్పవేం?' అన్నాడతను ఆమె ముఖంలోకి చూస్తూ.

'నా సంగతా? ఏముందీ? ఈ జీవితంపై నాకే నాడో రోత పుట్టేసింది. నా అంతట నేను చావలేక మాత్రమే జీవిస్తున్నాను యిలా బండగా - మొండిగా! అదీగాక, నేనిప్పుడు మీ జీవితంలోకి ప్రవేశించడమంటే - నిర్మలమైన కొలనులోకి మురుగు కాలవ ప్రవహించినట్లే అవుతుంది తప్ప వేరేమీ మంచి జరగదు. ఆదిలో నేనూ ఒక అనాథనే. అందరి ఆడాళ్ళలాగే బ్రతకాలని కలలు గన్నాను, విశ్వప్రయత్నాలూ చేశాను. కాని, ఏమీ లాభం లేకపోయింది. ఆ రోజుల్లో మీబోటి విశాల భావాలుగల సహృదయులొక్కరుకూడా నాకు కనిపించలేదు. అది నా దురదృష్టమో మరేమోగాని, ప్రతి ఒక్కరూ నన్ను తమ కోర్కెలు తీర్చేసాధనంగా తయారు చేయడానికి మాత్రమే చూచారు. అందువల్ల యిక వేరు గత్యంతరం లేదనిపించాకనే నేనీ వృత్తిలోకి దిగిపోవడం జరిగింది. నా గురించి మీరేమీ బాధ పడవద్దుగాని, ఎవరన్నా ఒక అనాథను నాలాగా కాకముందే కనిపెట్టి, కాపాడండి - అందుకు అమెకన్నా నేనే అధికంగా ఆనందిస్తాను! అన్యథా భావించకండి, మీరు నాపట్ల ప్రదర్శించిన ఆదరాభిమానాలను యెప్పుడూ మరిచిపోను,' అన్నదామె గాద్గదికంగా.

గుట్టలను, మిట్టలను చూస్తూ సగర్వంగా తలెత్తుకొని, రొమ్ము విరుచుకుని ముందుకు పోతున్న ఒక చిన్న కొండ-అనుకోకుండా హఠాత్తుగా మేరువు యెదురయితే చూచే చూపులతో ఆమెను చూస్తూ, అట్టే నిలబడిపోయాడతను...

●

## భూమి వయస్సు 450 కోట్ల సంవత్సరాలు !!

భూమి వయస్సు 450 కోట్ల సంవత్సరాలని లెనిన్‌గ్రాడ్ విజ్ఞాన శాస్త్రవేత్తలు బాల్టిక్ ప్రాంతపు (కోలా ద్వీపకల్పము, కారెలియా, ఫిన్లెండ్, స్వీడన్, నార్వేలలోని) రాళ్ళను పరిశోధించిన మీదట తెలియజేసారు.

సోవియట్ విజ్ఞాన శాస్త్రవేత్తలకు సంబంధించిన 'ప్రికాంబ్రియన్ లెబోరేటరీ' ఎకడమీషియన్ అలెగ్జాండర్ పొల్కనోవ్ అధ్వర్యంలో ఆర్గాన్ పద్ధతి ననుసరించిన పరిశోధనలను జరిపి అనేక రాళ్ళ వయసును నిర్ణయించింది. ఈ పద్ధతి ననుసరించి రాళ్ళనుండి మైకాను తీసి, కరిగించి, దానినుండి ఆర్గాన్ తీయబడింది. అదే సమయంలో ఆ మైకాలో పొటాసియం యెంతగా ఉన్నదో రసాయనిక పద్ధతుల ద్వారా నిర్ణయింపబడుతుంది. ఆర్గాన్, పొటాసియంలు ఆ రాళ్ళలో యే నిష్పత్తిలో ఉన్నాయో దానిని బట్టివాటి వయస్సు నిర్ణయింపబడుతుంది.

భూమి ఒక గ్రహంగా యేర్పడడానికి 50 కోట్ల సంవత్సరాలకు పూర్వమే ప్రీకేంబ్రియన్ పొరలు (భూమిపై పొరలన్నిటిలోకి అతి ప్రాచీనమైన పొరలు) యేర్పడ్డాయని నిర్ధారణ చేయబడింది.

ఎకడమీషియన్ పోల్కనోవ్, ప్రొఫెసర్ ఎరిక్ గెర్లింగ్‌లు సూచించిన యీ కొత్త పద్ధతిద్వారా భూమి యొక్క అతి ప్రాచీనకాలపు విషయాలు అనేకం బయటపడుతున్నాయి.

లెనిన్‌గ్రాడ్ విజ్ఞానశాస్త్రవేత్తల యీ పరిశోధనల ఫలితంగా ప్రీకాంబ్రియన్ దశలో ఇనుము, రాగి, నికెల్, మైకా మొదలైనవి యెలా యేర్పడ్డాయో తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా అర్కియాన్ పొరలు (ప్రీకాంబ్రియన్ పొరలన్నిటిలోకీ మొట్ట మొదటివి) యెంతకాలంక్రితం యేర్పడ్డాయో నిర్ణయించడం సాధ్యమవుతుంది. బెలెనెగోర్స్కులోనూ, కోలా ద్వీపకల్పంలోనూ, కర్స్కులోనూ ఉన్న ముడి ఇనుము నిధులు 2,300,000,000 సంవత్సరాలనాటివని యీ పద్ధతివల్ల తెలియవస్తున్నది.

★

మాష్టరు:-ఒరేసాము పదిమధ్య సున్నా పెడితే ఏంటి అవుతుందిరా!

సాము:-పదిమధ్య సున్నా పెడితే పంది అవుతుంది సార్!

మాష్టరు:-రాస్కెల్ బెంచి ఎక్కు.

(పదిమధ్య సున్నా పెడితే నూరు అవుతుంది.)

సింగంశెట్టి రామారావు.